సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం, 21, డిసెంబర్, 2023



సోమశిలలో 36.379 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో బుధవారం 36.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 619 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,450
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,788
3 శాతం జీఎస్టీతో	రూ.5,962
నవర (8 గ్రా)	రూ.47,696

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.4 /22.8

బుధవారం గాలిలో తేమ 77 శాతం ఉంది. ఉష్ణోగ్రత కనిష్టంగానే కొనసాగుతోంది. గురువారం కూడా పెద్ద మార్పులేవీ ఉండక పోవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్
వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఒకటో సెమిస్టర్ పరీక్షలకు 998 మంది విద్యార్థులకు గాను, 879 మంది హాజరై, 119 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షలకు 8,133 మందికి గాను, 7,542 మంది హాజరై, 591 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

నేడు ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ రాక
నెల్లూరు(దర్గామిట్ట): ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ–2024 ప్రక్రియ పరిశీలన నిమిత్తం ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ గురువారం జిల్లాకు వస్తున్నారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరి నారాయణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. 11 గంటలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

ఆ నిర్మాణాలు మంజూరు చేశాం
సాక్షి, న్యూఢిల్లీ: నెల్లూరు బైపాస్ సెక్షన్‌లోని గొలగమూడి జంక్షన్, సుందరయ్యకాలనీ జంక్షన్, బుజబుజనెల్లూరు టీ-జంక్షన్ అభివృద్ధి చేయాలని గుర్తించినట్లు కేంద్ర జాతీయ రహదారులు, రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. గొలగమూడి జంక్షన్ వద్ద వెహిక్యులర్ అండర్‌పాస్ (వీయూపీ), టీ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్, సుందరయ్యకాలనీ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద వీయూపీ నిర్మాణానికి ఎలాంటి ప్రతిపాదన పరిశీలనలో లేదని కేంద్ర మంత్రి తెలిపారు.

జలసిరులే జగన్నినాదం

జిల్లాలో అధికశాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. గత టీడీపీ ప్రభుత్వంలో సాగునీరు, వ్యవసాయ రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జిల్లాలో సాగునీరు, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి కీలకమైన సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణాలను పూర్తి చేశారు. అలాగే సోమశిల హైలెవల్ కెనాల్, ఉత్తర కాలువ ఆధునికీకరణ కోసం రూ.వందల కోట్లు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నారు.

జిల్లాలో వ్యవసాయ రంగానికి మహర్దశ
- సాగునీటి ప్రాజెక్టుల పనుల వేగవంతానికి సీఎం వైఎస్ జగన్ కృషి
- నెల్లూరు, సంగం బ్యారేజీలు పూర్తి చేసి జాతికి అంకితం
- టీడీపీ పాలనలో వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం



సంగం బ్యారేజ్ ప్రారంభం సందర్భంగా పెన్నమ్మకు పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అందరికీ అన్నం పెట్టే రైతన్నల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. జిల్లాలో సాగునీరు, వ్యవసాయ రంగాలపై దృష్టి సారించి పలు ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు సాగునీరు అందిస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన నెల్లూరు బ్యారేజ్ పనులను ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారు. ఈ బ్యారేజ్ ద్వారా సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువల కింద సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలో 99,525 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తున్నారు. ఈ బ్యారేజ్‌లో నిత్యం 0.4 టీఎంసీలను నిల్వ చేయడం ద్వారా సాగు, తాగునీటికి ఎలాంటి ఢోకా లేదు. నెల్లూరు బ్యారేజ్ కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి 2008లో శ్రీకారం చుట్టి అప్పట్లో రూ.147.20 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. వైఎస్సార్ హయాంలోనే రూ.86.92 కోట్లు ఖర్చు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్యారేజ్ నిర్మాణ పనులు అటకెక్కాయి. కమీషన్ల కోసం కక్కుర్తి పడి డిజైన్లలో మార్పులు చేసి అంచనా వ్యయాన్ని రూ.274.83 కోట్లకు సవరించినప్పటికీ పనులు చేపట్టడంలో విఫలమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బ్యారేజ్ నిర్మాణం పూర్తయింది.

ఎంజీఆర్ సంగం బ్యారేజ్

సంగం వద్ద పెన్నా జలాలను నిల్వ చేసి తద్వారా ఆయకట్టుకు నీరు అందించేలా వైఎస్సార్ హయాంలోనే ప్రణాళిక రూపొందించారు. జలయజ్ఞంలో భాగంగా సంగం బ్యారేజ్ నిర్మించి 3.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.335.80 కోట్లతో అంచనాలు రూపొందించారు. వైఎస్సార్ హయాంలోనే రూ.30.85 కోట్లు ఖర్చు చేశారు. ఆపై టీడీపీ హయాంలో బ్యారేజ్ పనులను నిర్లక్ష్యం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.131.12 కోట్లతో ఈ బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

ఆనం సంజీవరెడ్డి సోమశిల లింక్ కెనాల్

సోమశిల హై లెవల్ లిఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ ద్వారా సోమశిల రిజర్వాయర్ నుంచి 5 టీఎంసీలు సాగు, తాగునీరు అందించడానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఉత్తర కాలువ నుంచి ప్రారంభమయ్యే ఈ లింక్ కెనాల్ ద్వారా 90 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యంగా పనులు ప్రారంభించారు. ఈ కెనాల్ అంచనా వ్యయం మొదటి విడతలో రూ.840.90 కోట్లు కాగా ప్రభుత్వం ఇప్పటికే రూ.604.5 కోట్లు ఖర్చు చేసి 62.38 శాతం పనులు పూర్తి చేసింది. ప్రస్తుతం రెండో దశ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి టీడీపీ ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందని నిపుణులు పేర్కొంటున్నారు.

సోమశిల అప్రాన్ పనులు

సోమశిల జలాశయం వద్ద వరదలకు దెబ్బతిన్న అప్రాన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ భవిష్యత్తులో భారీ వరదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం రూ.117 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ పనులు పురోగతిలో ఉన్నాయి. అలాగే గతంలో జలాశయానికి దిగువన ఉన్న శివాలయానికి కుడివైపున ఉన్న రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపునకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఉత్తర కాలువ ఆధునికీకరణ

జిల్లాలో మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఉత్తర కాలువ ఆధునికీకరణ కోసం రూ.640 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సోమశిల జలాశయం నుంచి కందుకూరు నియోజకవర్గం రాళ్లపాడు జలాశయం వరకు సుమారు 101 కి.మీ. పొడవున్న ఉత్తర కాలువ నీటి తరలింపు సామర్థ్యం 350 క్యూసెక్కుల నుంచి 700 క్యూసెక్కులకు పెంచేలా కాలువ ఆధునికీకరణ చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే 1.10 లక్షల ఎకరాల ఆయకట్టు పెరగనుంది.

సర్వేపల్లి కాలువ

నెల్లూరులో సర్వేపల్లి కాలువ రక్షణ గోడల నిర్మాణానికి ప్రభుత్వం రూ.99.95 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం 60 శాతం పనులు పూర్తి కాగా ఇప్పటి వరకు రూ.60 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగునీరు, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా జిల్లాలోని భూములు సస్యశ్యామలం అవుతున్నాయంటూ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సోమశిల-కండలేరు వరద కాలువ ఆధునికీకరణ
సోమశిల–కండలేరు వరద కాలువ (45 కి.మీ. పొడవు) ఆధునికీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.960 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. వరద కాలువ నీటి విడుదల సామర్థ్యం రోజుకు ఒక టీఎంసీ మాత్రమే ఉండగా, ఆ సామర్థ్యాన్ని రెండు టీఎంసీల పెంచేలా ప్రభుత్వం ఆధునికీకరణ పనులు నిర్వహిస్తోంది.



జగనన్న విదేశీ విద్యాదీవెన మెగా నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ తదితరులు

ఉన్నత శిఖరాలకు చేరండి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): విదేశాల్లో చదవాలని కలలుగనే విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన ఒక వరమని, ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్యాదీవెన, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం పథకాలకు సంబంధించి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొని లబ్ధిదారులకు మెగా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ విలేకరులతో మాట్లాడుతూ జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా ఎంతో మంది విద్యార్థులు విదేశాల్లోని యూనివర్సిటీల్లో చదువుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు, మన ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లాలో 20 మందికి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా రూ.2.05 కోట్లు, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం కింద ఐదుగురికి రూ.5 లక్షలు ముఖ్యమంత్రి వారి ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల్లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష పాసైన వారికి ప్రోత్సాహంగా రూ.లక్ష ప్రభుత్వం అందజేస్తోందని, మెయిన్స్ పాసైన వారికి అదనంగా మరో రూ.50 వేలు అందజేసి తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న రాష్ట్రానికి చెందిన అర్హులైన 390 మందికి రూ.41.60 కోట్లు, సివిల్ సర్వీసెస్ పరీక్ష ప్రిలిమినరీలో ఉత్తీర్ణత సాధించిన 95 మందితోపాటు మెయిన్స్ ఉత్తీర్ణులైన 11 మందికి ప్రోత్సాహంగా రూ.1.50 కోట్లు ముఖ్యమంత్రి వారి ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. విదేశాల్లో పేరుపొందిన 50 యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ.1.25 కోట్లు, ఇతర విద్యార్థులకు రూ.కోటి వరకు ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. విమాన ప్రయాణం, వీసా ఖర్చులను ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందన్నారు. మేయర్ స్రవంతి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల విద్యాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు రమేష్, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి వెంకట్, గిరిజన సంక్షేమాధికారి పరిమళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

2.94 లక్షల ఎకరాలకు సాగునీరు

- సోమశిల ఎస్ఈ బి.వెంకటరమణారెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సోమశిల జలాశయానికి నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా కాస్త వరద జలాలు వచ్చి చేరాయని, జిల్లాలో తొలి పంటకు 2,94,500 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు సోమశిల సూపరింటెండెంట్ ఇంజినీర్ బసిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమశిల జలాశయంలో ఇన్‌ఫ్లో కలుపుకొని ప్రస్తుతం 36.379 టీఎంసీలు ఉన్నాయని, పెన్నా డెల్టా పరిధిలోని కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లలో 3 టీఎంసీల నీటి లభ్యత ఉందని తెలిపారు. డెడ్ స్టోరేజీ, నీటిఆవిరి, తాగునీటి అవసరాలకు, రాళ్లపాడు జలాశయానికి కలిపి 10 టీఎంసీల నీరు అవసరమని తెలిపారు. మిగిలిన 29 టీఎంసీల నీటిని ఖరీఫ్ సాగుకు గాను సోమశిల జలాశయం పరిధిలో పెన్నా డెల్టాలో 2 లక్షల ఎకరాలకు 19 టీఎంసీలు, కనుపూరు కాలువ కింద 31,500 ఎకరాలకు 3 టీఎంసీలు, బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువ కింద 31,500 ఎకరాలకు 3 టీఎంసీలు, ఉత్తర కాలువ కింద 24వ ఆర్ డిస్ట్రిబ్యూటరీ వరకు 21,000 ఎకరాలకు 2 టీఎంసీలు, దక్షిణ కాలువ కింద 10,500 ఎకరాలకు ఒక టీఎంసీ సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. రైతులు తొందరపడి సాగునీరు లభ్యత లేని ప్రాంతాల్లో నారుమళ్లకు సిద్ధం కావద్దని, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

నిరంతర సాధనతో గొప్ప విజయాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్స్ విజేత బాలలత



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

- అభ్యర్థులు పోటీ పరీక్షలపై భయం వీడాలి
- ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి
- సివిల్స్ విజేత బాలలత పలు సూచనలు
- సాక్షి మీడియా ఆధ్వర్యంలో గ్రూప్స్ పరీక్షల అవగాహన సదస్సుకు విశేష స్పందన

నెల్లూరు (టౌన్) : ప్రణాళికతోపాటు నిరంతర సాధన ద్వారా ఎలాంటి పోటీ పరీక్షల్లోనైనా గొప్ప విజయాలు సాధించవచ్చని సివిల్స్ విజేత బాలలత పేర్కొన్నారు. సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో నెల్లూరులో బుధవారం నిర్వహించిన గ్రూప్–1, 2 పరీక్షల అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న దేవిశెట్టిస్వాములు రాజేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి ఏపీపీఎస్సీ, గ్రూప్–1, 2 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. ఈ అవగాహన సదస్సుకు సివిల్స్ విజేత బాలలత ముఖ్య వక్తగా హాజరయ్యారు. గ్రూప్–1, 2 పరీక్షలకు అభ్యర్థులు ఏ విధంగా సన్నద్ధం కావాలన్న దానిపై ఆమె దిశా నిర్దేశం చేశారు.

ఒత్తిడి, భయం వీడితేనే విజయం

ఒత్తిడితో పాటు గ్రూప్స్ పరీక్షలపై భయాన్ని వీడితేనే విజయం సొంతం అవుతుందని బాలలత తెలిపారు. కోచింగ్ సెంటర్‌కు వెళ్తే నువ్వు గ్రూప్స్ రాయగలవా, నీ వల్ల అవుతుందా అని అనేక ప్రశ్నలతో మిమ్మల్ని భయపెట్టేవారు ఉంటారని, పోలియో బారిన పడి నడవలేని స్థితిలో ఉన్న తాను ఇలాంటి ప్రశ్నలు, అవమానాలు ఎదుర్కొని ముందుకు నడిచానన్నారు. 2004లో సివిల్స్‌లో ఆలిండియా స్థాయిలో 399వ ర్యాంకు, 2016లో 167వ ర్యాంకు సాధించానన్నారు. ప్రధానంగా ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకే సమాధానం చెప్పాలని, రాని ప్రశ్నలకు వచ్చినట్లు వ్యవహరించకూడదని సూచించారు.

ఓర్పు, సహనం అవసరం

గ్రూప్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఓర్పు, సహనం చాలా అవసరమన్నారు. అందుకు సంబంధించి పలు ఉదాహరణలను అభ్యర్థులకు తెలియజేశారు. ప్రధానంగా అన్ని పోటీ పరీక్షలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్‌చార్జి కె.నాగశ్రీనివాసరావు, సాక్షి చానల్ బ్యూరో ఇన్‌చార్జి వెంకట్, ఈవెంట్ మేనేజర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు ఇలా చేయాలి..

- ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల పాటు చదువుకోవాలి. 2- 3 గంటల పాటు మోడల్ పేపర్లు ప్రాక్టీసు చేయాలి.
- ప్రతిరోజూ ఇంగ్లిష్, తెలుగు వార్తా పత్రికలు చదివి ముఖ్యమైన వాటిని నోట్సు రూపంలో తయారు చేసుకోవాలి.
- గ్రూప్స్ పరీక్షల్లో ఇండియన్ సొసైటీ, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ, జాగ్రఫీ, హిస్టరీ తదితర వాటిపై ప్రధానంగా దృష్టి సారించాలి.
- పోటీ పరీక్షల్లో మాక్ టెస్ట్‌లు, సొంత నోట్స్‌లు ప్రిపేర్ చేసుకోవాలి.
- చదవడంతో పాటు ఎగ్జామ్స్‌లో టైమ్ మేనేజ్‌మెంట్ ప్రధానంగా చూసుకోవాలి.
- సిలబస్‌ను పూర్తిగా తెలుసుకోవడంతో పాటు ప్రతిరోజూ టైంటేబుల్ వేసుకోవాలి.
- టాపిక్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలి.
- సిలబస్‌ను మ్యాపింగ్ చేసుకుని తదనుగుణంగా ప్రిపేర్ కావాలి.
- సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధ్యయనం చేయాలి.
- ఏపీ గణాంకాలను పూర్తిగా తెలుసుకోవాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లు, ఆర్థిక సర్వేలపై అవగాహన పెంచుకోవాలి.
- ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా జరిగిన విపత్తులపై అవగాహన ఉండాలి.
- ఏఐ, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- రాష్ట్ర సంస్కృతిని పూర్తిగా తెలుసుకోవాలి.
- రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులు, పోర్టులు తదితర వాటిపై పూర్తిగా అధ్యయనం చేయాలి.

అవగాహన పెరిగింది



గ్రూప్–1, 2 పరీక్షలపై అవగాహన పెరిగింది. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తెలుసుకున్నా. ఏఏ అంశాలపై దృష్టి సారించాలో వివరంగా చెప్పారు. కరెంట్ అఫైర్స్‌లో ఎలాంటి విషయాలపై దృష్టి సారించాలో సదస్సు ద్వారా తెలిసింది. ఇలాంటి సదస్సులకు హాజరు కావడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది.

– జి.ఏడుకొండలు, కొండాపురం

విలువైన సమాచారం తెలుసుకున్నా



సాక్షి మీడియా నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరుకావడం వల్ల గ్రూప్స్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో తెలుసుకున్నా. పరీక్షల్లో అపోహలు, సందేహాలను నివృత్తి చేసుకున్నా. ఇప్పుడు గ్రూప్స్ పరీక్షలంటే భయం పోయింది. ధైర్యంగా పరీక్ష రాయగలనన్న నమ్మకం ఏర్పడింది.

– పి.అనూష, హరనాథపురం

ఎంతో ఉపయోగం



గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నప్పటికీ సిలబస్ గురించి పూర్తిగా తెలియదు. సాక్షి మీడియా గ్రూపు నిర్వహించిన అవగాహన సదస్సులో సిలబస్ గురించి తెలుసుకున్నా. ఇప్పటి నుంచి బాలలత మేడమ్ ఇచ్చిన సూచనల ప్రకారం ప్రిపేర్ అవుతా. అవగాహన సదస్సు వల్ల ఎంతో ఉపయోగం ఉంది.

– సీహెచ్ కుందన, నవాబుపేట

అపోహ, భయం తొలగింది



సాక్షి మీడియా నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల అవగాహన సదస్సు వల్ల నాలో ఉన్న అపోహలు, భయం పూర్తిగా తొలగిపోయాయి. గ్రూప్స్ పరీక్షలకు ఎలాంటి ప్రశ్నలు ఉంటాయో, నేను రాయగలనో లేదోనన్న భయం ఉండేది. అవగాహన సదస్సుతో సిలబస్‌పై పూర్తి అవగాహన వచ్చింది.

– వై.కృష్ణవేణి. బుచ్చిరెడ్డిపాళెం

సాక్షికి అభినందనలు



గ్రూప్–1, 2 పరీక్షలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించిన సాక్షి మీడియాకు అభినందనలు. గ్రూప్స్ పరీక్షలపై పూర్తి అవగాహన వచ్చింది. ఈ సదస్సుకు హాజరుకావడం వల్ల ఎన్నో విలువైన విషయాలు తెలుసుకున్నా. పోటీ పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ కావాలన్న దానిపై మార్గనిర్దేశం చేశారు.

– దాసరి వెంకటేశ్వర్లు, కావలి

విలువైన సదస్సు



పోటీ పరీక్షలపై మేడమ్ ఎన్నో సూచనలిచ్చారు. గ్రూప్స్‌లో విజయం సాధించాలంటే ఎలా ప్రిపేర్ కావాలో తెలుసుకున్నా. ఈ సదస్సుకు హాజరుకావడం వల్ల మరింత స్పష్టత వచ్చింది. ఈ సదస్సు నిర్వహించిన సాక్షి మీడియా వారికి కృతజ్ఞతలు.

– కుడుముల గంగాధర్, కావలి

'ఆడుదాం ఆంధ్రా'కు పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు(దర్గామిట్ట) : 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లతో బుధవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్‌మర్మత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడోత్సవాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

సోమిరెడ్డివి కిరాయి రాజకీయాలు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విద్యుత్ లైన్ షిఫ్టింగ్, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కిరాయి రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని అగచాట్లపురం, శింగయ్య చేను ప్రాంతాల్లో రూ.80 లక్షలతో ఇళ్లపై నుంచి వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులకు, రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సోమిరెడ్డి కిరాయి తీసుకుని తాటిపర్తి వద్ద ఉన్న రుస్తుం మైన్‌లో సత్యాగ్రహ దీక్ష పేరుతో కూర్చున్నట్టు తెలిపారు. మైన్ వద్దకు హిజ్రాలను ఎవరు పంపారో తేల్చాలన్నారు. ఇద్దరు ప్రైవేట్ వ్యక్తుల వివాదంలో సోమిరెడ్డి తలదూర్చి క్యాష్ వసూలు చేస్తున్నట్టు విమర్శించారు. సోమిరెడ్డి పోరాటాలు, దీక్షల పేరుతో ప్యాకేజీలు మాట్లాడుకుని వస్తుంటాడని ఆరోపించారు. చంద్రబాబు లోకేశ్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలని ప్రయత్నిస్తున్నాడని, కానీ టీడీపీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ విజయన్, ఈఈ జయకృష్ణారెడ్డి, ఏడీఈ సురేంద్ర బాబు, తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, డాక్టర్లు రిషిత, కావ్య, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ సేవలు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ హేనాసుజన్



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న జేసీ కూర్మనాథ్, పీడీ హేనాసుజన్

నెల్లూరు (వేదాయపాళెం) : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తిస్థాయిలో సేవలు అందుతున్నాయని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన నేపథ్యంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం బుధవారం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఆయా సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించింది. జిల్లాలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా బుధవారం 2,778 కేంద్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. కాగా జేసీ కూర్మనాథ్, పీడీ హేనాసుజన్ నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	రూ.105
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్	రూ.190
స్కిన్‌లెస్ చికెన్	రూ.210
లేయర్ చికెన్	రూ.170

మతోన్మాదం ప్రమాదకరం

• జై భారత్ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి



మాట్లాడుతున్న రమణమూర్తి

ఇందుకూరుపేట: మతోన్మాదం దేశానికి అత్యంత ప్రమాదకరమని జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి అన్నారు. మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో జైహో జాతీయ సమ్మేళన కార్యక్రమాన్ని వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తితో అందరూ ఐక్యంగా మతోన్మాదులను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. గాంధీజీ పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డిసెంబర్ 19 నుంచి జనవరి 30వ తేదీ వరకు జరిగే జైహో హిందూ, ముస్లిం సమైక్యత సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను జమ్మూకశ్మీర్ నుంచి విచ్చేసిన ఖయ్యూం, జైభారత్ జాతీయ అధ్యక్షురాలు సైరా షేక్, సర్వసేవా సంఘ్ అధ్యక్షుడు ప్రసాద్ విజయవిహారం రమణమూర్తి ఆవిష్కరించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో జైహో జాతీయ కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి రజిని, హెచ్‌పీఈ అధ్యక్షుడు సాధు త్రినాథ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సమావేశం రేపు

నెల్లూరు (దర్గామిట్ట) : జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి జేసీ రోణంకి కూర్మనాథ్ చాంబర్‌లో శుక్రవారం సమావేశం జరుగుతుందని ఐ అండ్ పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ సదారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమయ్యే సమావేశానికి కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.20
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

వీఎస్‌యూ విద్యార్థులపై ఏబీవీపీ నేత దాడి

వెంకటాచలం : వీఎస్‌యూ విద్యార్థి కమతం అఖిల్‌తో పాటు మరికొందరి విద్యార్థులపై ఏబీవీపీ నేత రాజశేఖర్ దాడి చేశారు. ఈ ఘటన మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు నగరం వనంతోపు ప్రాంతానికి చెందిన అఖిల్ వీఎస్‌యూలో ఎంఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి వీఎస్‌యూ క్యాంపస్‌లోని తిక్కన ఓపెన్ ఆడిటోరియంలో ప్రీ క్రిస్మస్ సంబరాల్లో అఖిల్ పాల్గొన్నాడు. ఈ సమయంలో ఏబీవీపీ నేత రాజశేఖర్ మరో పది మందితో కలిసి స్టేజీ మీదకు ఎక్కి ప్రోగ్రామ్ చేయకూడదంటూ అఖిల్‌పై దాడి చేశాడు. అడ్డుకోబోయిన విద్యార్థులపై కూడా దాడి చేశాడు. కిటికీ అద్దాలు పగలగొట్టి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడంతో అధ్యాపకులు అక్కడకు చేరుకున్నారు. దీంతో రాజశేఖర్ అక్కడి నుంచి పరారయ్యారు. దాడిపై అఖిల్ ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూజల పేరిట బురిడీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వీరానాయక్

• ఇద్దరు నిందితుల అరెస్ట్
• రూ.6 లక్షల నగదు, కారు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): పూజ చేసి ఆరోగ్యం బాగుచేస్తామని దంపతులను నమ్మించి నగదుతో ఉడాయించిన ఘటనలో ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ నిందితుల వివరాలను వెల్లడించారు. సరస్వతీనగర్‌లో బి.శ్రీనివాసులురెడ్డి, రాజమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీనివాసులురెడ్డికి సూళ్లూరుపేటలో స్థలాలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం వాటిని అమ్మే క్రమంలో సూళ్లూరుపేట కోళ్లమిట్టకు చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ ఎన్.సుబ్బారావుతో పరిచయమైంది. ఈ క్రమంలో శ్రీనివాసులురెడ్డి కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం రూ.9 లక్షల నగదును తన ఇంట్లో ఉంచుకున్నారు. దీనిని గమనించిన సుబ్బారావు ఎలాగైనా నగదును కాజేయాలని పన్నాగం పన్నాడు. పూజలు చేస్తే పక్షవాతం నయం అవుతుందని దంపతులను నమ్మించాడు.

పూజారిని సంప్రదించి..

సుబ్బారావుకు తమిళనాడులోని మధురై జిల్లా ఉసులమ్‌పట్టికి చెందిన పూజారి పుదురాజాతో పరిచయం ఉంది. సుబ్బారావు పూజారికి, అతని సహాయకుడు ప్రసాద్‌కు తన పన్నాగాన్ని తెలియజేశాడు. దోచుకున్న సొత్తును పంచుకుందామని చెప్పాడు. అదే ప్రాంతానికి చెందిన జవహర్ అనే వ్యక్తి కారులో నెల్లూరుకు వచ్చి ఈనెల 15న శ్రీనివాసులురెడ్డి ఇంట్లో పూజలు చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న డబ్బును పూజలో పెట్టాలని రాజమ్మకు సూచించగా ఆమె రూ.9 లక్షల నగదును తెచ్చి పెట్టింది. పూజ సమయంలో ఎవరూ ఉండకూడదని చెప్పడంతో దంపతులిద్దరూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన నిందితులు అక్కడి నుంచి నగదుతో ఉడాయించారు. మోసపోయామని గ్రహించిన బాధితులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూళ్లూరుపేట హోలీక్రాస్‌రోడ్డు వద్ద సుబ్బారావు, పూజారి పుదురాజాలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.6 లక్షల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రసాద్, జవహర్‌తో పాటు కారు డ్రైవర్ మోహన్ కోసం గాలిస్తున్నారు.

80 కేజీల గంజాయి స్వాధీనం

గూడూరు రూరల్ : రెండు కార్లలో 80 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకుని ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రాజేంద్ర తెలిపారు. గూడూరు రెండో పట్టణంలోని సెబ్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని హస్తినాపురం, బోడుప్పల్, నల్గొండ టౌన్, శంషాబాద్, నార్కెట్‌పల్లి ప్రాంతానికి చెందిన పి.ప్రశాంత్‌రెడ్డి, బొంతా పరమేష్, బొంతా ప్రసాద్, దాసర్ల శేఖర్, గొలుసుల నరేష్ స్నేహితులు. వీరు గత రెండేళ్లుగా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. వీరిపై తెలంగాణలో కూడా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో వీరు రెండు కార్లలో నర్సీపట్నం సమీపంలో అప్పన్న అనే వ్యక్తికి రూ.4 లక్షలు చెల్లించి 80 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. దీనిని ప్యాకెట్ల రూపంలో కర్నాటకలోని రామనగర్ జిల్లా, చెన్నపట్నం వద్ద షబ్బీర్ అనే వ్యక్తికి విక్రయించేందుకు బయలుదేరగా బూదనం వద్ద పట్టుబడ్డారు. పట్టుకున్న ఐదుగురిని కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో సెబ్ సీఐ విజయకుమార్, ఎస్సై శేషమ్మ, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్‌సింగ్ పాల్గొన్నారు.